## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

**హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** అక్టోబరు 2 నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్తు, నీటి పారుదల, నగరపాలక, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బతుకమ్మలు ఆడే ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలతో పాటు విద్యుత్తు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. వేయిస్తంభాల గుడి, పద్మాక్షి అమ్మవారు, రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాల్లో బతుకమ్మ సంబరాలకు మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, శంకరశర్మ, విష్ణువర్ధనాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

# జీవన శైలి.. లయ తప్పొద్దు

**నేడు ప్రపంచ హృదయ వ్యాధుల నివారణ దినం**


ఆదివారం ప్రత్యేకం

గుండె జబ్బులు వచ్చిన తర్వాత పరుగులు తీయడమే తప్ప అవి రాకుండా నివారించే విధానాలపై చాలామంది ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగానే గుండెపోటుకు గురయ్యే వారి సంఖ్య పెరిగిపోతోంది. గుండె శస్త్రచికిత్సల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితి తావులేకుండా జీవన శైలిలో మార్పులతో ప్రకృతితో కలిసి జీవనం సాగించడం ద్వారా గుండెను జీవితాంతం సురక్షితంగా ఉంచుకోవచ్చని ప్రకృతి వైద్యులు సూచిస్తున్నారు. నిత్య వ్యాయామంతో బరువు నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు కొవ్వును కరిగించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నేడు ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినం సందర్భంగా కథనం..

-న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

**నేడు కేఎంసీలో అవగాహన**

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలోని ఎన్ఆర్ఐ భవన్‌లో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామక శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ వర్గాల వారికి అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.



**తృణధాన్యాలు**
కొర్రలు, సజ్జలు, జొన్నలు, బ్రౌన్ రైస్, ఓట్స్ వంటివి తీసుకోవాలి. బార్లీ, బీన్స్ కాయ ధాన్యాలు, శనగలు, చిక్కుళ్లు ఎక్కువగా తినాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను రక్తంలో చక్కెరను తగ్గించి, నియంత్రిస్తాయి.

**ఆకు, కాయగూరలు**
బచ్చలికూర, కాలీఫ్లవర్, టమాట, క్యాబేజీ, క్యారెట్, పాలకూర, వంటి తాజా కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు సహా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బరువును నియంత్రించడానికి సహాయపడతాయి.

**వ్యాయామం అవసరమే**
శరీర వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి. నిపుణుల పర్యవేక్షణలో యోగా చేయడం ద్వారా అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. గుండెకు మేలు చేస్తుంది.

**బెర్రీలు**
స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్బెర్రీలు వంటివి యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్‌తో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ, ఒత్తిడి, వాపు, గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తాయి. సి విటమిన్ అధికంగా ఉండే పండ్లు తీసుకోవాలి.

**గ్రీన్ టీ**
యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జీవక్రియను పెంచడం, శరీర కొవ్వును నియంత్రించడం, ఇన్సులిన్ సెన్సిటివ్ మెరుగుపర్చి బరువును నియంత్రిస్తుంది.

**చేపలు, నూనెలు**
మాకేరెల్, సార్డినెస్, ట్యూనా వంటి చేపల్లో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ట్రైగ్లిజరైడ్‌లు మంటను తగ్గిస్తాయి. గుండె లయను మెరుగుపరుస్తాయి.

**వెల్లుల్లి**
రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. ప్రతి రోజు 1-2 గ్రాముల వెల్లుల్లి దంచి పాలలో వేసి మరిగించి తాగడంతో గుండెకు బలంతో పాటు, చర్మరోగాలు, శ్వాస వ్యాధులు తగ్గుతాయి.

**వాల్‌నట్‌లు**
వాల్‌నట్‌లు, బాదం, పిస్తా, గుమ్మడి, పొద్దుతిరుగుడు గింజలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఫైబర్, పొటాషియమం, మెగ్నీషియం లభిస్తాయి. అవిసె గింజల్లో ఉండే ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కొలెస్ట్రాల్, మంటను తగ్గిస్తాయి.

**ప్రకృతి జీవన విధానాన్ని అనుసరిస్తున్నా..**



**- అచ్చ వినోద్‌కుమార్, విద్యానగర్ కాలనీ, వరంగల్**

గుండె సంబంధిత సమస్య రాగానే ఓ పెద్ద ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్నాను. మా కూతురు ప్రకృతి వైద్యురాలు కావడంతో నా జీవన విధానం, ఆహార అలవాట్లను మార్చేసింది. తృణ ధాన్యాలు, పిస్తా, బాదం, వాల్‌నట్, చిక్కుళ్లు ఉండేలా చూస్తాను. అన్నం, చక్కెర, ఉప్పు పూర్తిగా తగ్గించాను. ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవు.

**పూర్వీకుల నుంచి నేర్చుకోవాలి..**



**- డాక్టర్ మైదం రాజు, ఆయుష్ వైద్యులు**

మన పూర్వీకుల ప్రకృతి జీవన విధానానికి మనం దూరంగా ఉండటం వల్లనే గుండె జబ్బులు వస్తున్నాయి. మంచి ఆహారం, నిద్ర అవసరం. ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర, వరి అన్నం వదిలి తృణ ధాన్యాలు తీసుకోవాలి, ధ్యానం, యోగాసనాల ద్వారా గుండె జబ్బుల నుంచి బయటపడొచ్చు.



కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో గుండె వైద్యం కోసం వరుస కట్టిన రోగులు

| కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జనవరి నుంచి ఇప్పటివరకు చికిత్స వివరాలు | కార్డియాలజీ ఓపీ | యాంజియోగ్రామ్ | స్టంట్లు | 2డి ఏకో పరీక్షలు | ఈసీజీ పరీక్షలు |
|---|---|---|---|---|---|
| | 25,444 | 634 | 212 | 22,980 | 16,522 |

## కూడలి అభివృద్ధికి ప్రణాళిక

**హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** జిల్లాలోని ఎల్కతుర్తి మండల కేంద్రం కూడలి సుందరీకరణకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎల్కతుర్తి కూడలి అభివృద్ధి, జిల్లాలో ప్రభుత్వ స్థలాల గుర్తింపు, నాలాల ఆక్రమణలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కుడా, నగరపాలక సంస్థ, జిల్లా పరిధిలోని నాలాలు, చెరువులు, ప్రభుత్వ భూముల సర్వే చేసి నివేదిక సమర్పించాలన్నారు. నాలాల ఆక్రమణల తొలగింపులో ఇబ్బందులుంటే తెలపాలన్నారు. నగరంలో 70కి పైగా ఉన్న చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అశ్వనీ తానాజీ వాకడే, ఆర్‌డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావిణ్య

**అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి**

**హనుమకొండ కలెక్టరేట్ :** ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.

## ఆస్తి పన్ను ఆదాయం పెంచండి

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రతి ఇంటిని పరిశీలించండి, ఆస్తిపన్ను హెచ్చుతగ్గులను పునఃపరిశీలన చేసి ఆదాయం పెంచే విధంగా చూడాలని కమిషనర్ డా.అశ్విని తానాజీ ఆదేశించారు. బుధవారం సాయంత్రం బల్దియా సమావేశ మందిరంలో భువన్ యాప్ సర్వే, క్షేత్రస్థాయిలో పరిశీలన, పన్ను మదింపు సవరణ పురోగతిని సమీక్షించారు. నగరంలోని 66 డివిజన్ల ఆస్తిపన్ను అసెస్‌మెంట్ సమాచారాన్ని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) వెబ్‌సైట్‌లో ఉందని, దీని ఆధారంగా భువన్ యాప్ సాంకేతిక సమాచారాన్ని పరిశీలించాలని కమిషనర్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం ఆస్తిపన్నుల నవీకరణ చేపట్టాలన్నారు. సీజీజీ, భువన్ యాప్ డేటా ప్రకారం గ్రేటర్ వరంగల్ పరిధిలో 2,979 ఆస్తిపన్నులు నవీకరించాలని, వీటిని తొందరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్వోలు శ్రీనివాస్, షహజాది బేగం, ఐటీ మేనేజర్ రమేశ్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



## పచ్చని గుట్టల్లో పద్మాక్షమ్మ



చుట్టూ పచ్చని గుట్టలు.. ప్రకృతి ఒడిలో పద్మాక్షి అమ్మవారు సేదతీరుతున్నట్లు ఉన్న ఈ చిత్రం శనివారం వివిధ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. అంతెత్తులోనుంచి చూస్తుంటే.. గుట్టపై పెరిగిన పచ్చని చెట్లు.. మధ్యలో పద్మాక్షి తటాకం, ఆలయం ఆహ్లాదకరంగా ఉన్నాయి. కాకతీయుల కాలంలో జైన, హిందూ సంప్రదాయ పద్ధతిలో నిర్మించిన ఆలయంలో కొలువైన పద్మాక్షి అమ్మవారిని ఓరుగల్లు ఇలవేల్పుగా భక్తులు కొలుచుకుంటారు.

– న్యూస్‌టుడే, గిర్మాజీపేట (హనుమకొండ)

## పూల పండగ సందడి



కాకతీయ విశ్వ విద్యాలయం సుబేదారి పీజీ కళాశాలలో శనివారం అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ఆవరణలో ఆడిపాడుతూ సందడి చేశారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధ్యాపకులు రామదేవి, చంద్రకళ, సరిత, రజిత, భాగ్యమ్మ, వినోద పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సుబేదారి

## 30న అథ్లెటిక్స్ పోటీలు

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** ఈ నెల 30న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు జిల్లాస్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన అథ్లెట్లు అక్టోబరు 7, 8 తేదీల్లో హనుమకొండ జేఎన్ స్టేడియంలో జరిగే 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.



## జిల్లాలో 3,65,832 మంది పంచాయతీ ఓటర్లు

**హనుమకొండ కలెక్టరేట్, భీమదేవరపల్లి, న్యూస్‌టుడే :** పంచాయతీ ఎన్నికలకు ఒకడుగు ముందుకు పడింది. ఈ ప్రక్రియలో కీలకమైన తుది ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ నెల 13న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేసి, పంచాయతీల్లో ప్రదర్శించారు. వాటిలో పొరపాట్లు, పేర్లలో తప్పులు, అభ్యంతరాలపై 14 నుంచి 21 వరకు వినతులు స్వీకరించారు. అనంతరం తప్పులను సరిదిద్ది.. మార్పులు, చేర్పులతో శనివారం తుది జాబితా విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం పంచాయతీ ఓటర్లు 3,65,832 మంది ఉండగా, అందులో పురుషులు 1,78,824, మహిళలు 1,87,006, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఓటరు జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీల్లో ఓట్లను విభజించి, వార్డుల వారీగా రూపొందించారు. వార్డు పరిధిలో ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాగ్రత్త వహించారు.



ములుకనూర్ పంచాయతీ కార్యాలయంలో జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో వీరేశం, ఈవో పూర్ణచందర్

## లోక్ అదాలత్‌లో 7741 కేసులు పరిష్కారం

**వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే:** హనుమకొండ జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయస్థానాలు, పరకాల న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 7741 కేసులను రాజీ మార్గంగా పరిష్కరించారు. దీనిలో సివిల్ 7, క్రిమినల్ 7625, బ్యాంకు కేసులు 42 ఉన్నాయి. వీటితో పాటు 67 మోటారు ప్రమాద కేసులను రాజీ మార్గంగా పరిష్కరించి, మృతుల కుటుంబీకులు, బాధితులకు బీమా సంస్థల నుంచి రూ.3,50,75,000 పరిహారం ఇప్పించే విధంగా న్యాయమూర్తులు కృషి చేశారు. ఈ మొత్తాన్ని త్వరలోనే జిల్లా కోర్టు ఖాతాలో జమ చేయనున్నారు. లోక్ అదాలత్‌లో జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జాబిశెట్టి ఉపేందర్‌రావు, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కక్షిదారులకు తీర్పు ప్రతులను అందజేస్తున్న హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి అపర్ణాదేవి, చిత్రంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మలాగీతాంబ

## కాసులిస్తే సరే.. లేదంటే తిరకాసు!

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల తీరుతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులిస్తే సరే.. లేదంటే చిన్న చిన్న కారణాలను చూపుతూ.. భవన నిర్మాణ అనుమతులు తిరస్కరిస్తున్నారు. కిందిస్థాయి ఉద్యోగులను కట్టడి చేయాల్సిన ఉన్నతాధికారి తీరు సైతం ఇలాగే ఉండటం గమనార్హం. దీంతో కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల చుట్టూ దరఖాస్తుదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్ర పురపాలిక శాఖ, టీఎస్-బీపాస్ నిబంధనల ప్రకారం 21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు (బిల్డింగ్ పర్మిషన్లు) ఇవ్వాలి. లేదంటే తిరస్కరించాలి. అకారణంగా ఆలస్యం చేస్తే సంబంధిత అధికారి, ఉద్యోగులకు జరిమానాలు విధించాలనే నిబంధనలున్నాయి. కొన్ని నెలలుగా భవన నిర్మాణ అనుమతి దస్త్రాల పరిష్కారం, పెండింగ్‌లపై సిటీప్లానర్, కమిషనర్ సమీక్షించడం లేదు. దీంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం

**ఇవిగో సాక్ష్యాలు**

- రంగశాయిపేట శివారు గణేశ్‌నగర్‌లో ఓ ఉద్యోగి 245 గజాల స్థలంలో భవన నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే రెండుసార్లు తిరస్కరించారు. మూడోసారి మళ్లీ కాలనీ అంతర్గత రోడ్డు తనఖా పెట్టలేదని అనుమతి ఇవ్వలేదు.
- ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లోని ఇద్దరు పేదలు 70 గజాల్లోపు స్థలంలో రూపాయి అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. ఎలాంటి కారణాలు చూపకుండానే వారి దస్త్రాలు పక్కన పడేశారు.
- హనుమకొండ గోపాల్‌పూర్‌లో ఓ వ్యాపారి 234 గజాల స్థలంలో భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేయగా. . రెండుసార్లు క్షేత్రస్థాయి ఉద్యోగి పరిశీలించారు. డబ్బులు ఇవ్వకపోవడంతో కొర్రీలు పెట్టారు.
- మడికొండ విలీన గ్రామంలో రూపాయి అనుమతి ఎందుకు తిరస్కరించారని దరఖాస్తుదారుడు నిలదీసినందుకు దస్త్రం తిరస్కరించారు.
- హనుమకొండ రెడ్డిపురం శివారులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు 2017లో ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) ఉన్నప్పటికీ మాస్టర్ ప్లాన్ నిబంధనల పేరుతో తిరస్కరించారు. 'కుడా'కు లేఖ రాసి సందేహాలు నివృత్తి చేయకుండానే తిరస్కరించడంపై దరఖాస్తుదారులు అధికారులను నిలదీశారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి శనివారం ప్రారంభమయ్యాయి. వరంగల్ నగర శివారులోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహిస్తున్న అండర్-19 క్రికెట్ పోటీలను కుడా(కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు కేంద్రంగా 'కుడా' ఆధ్వర్యంలో క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూల్ 'ఏ'లో వరంగల్, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు, పూల్ 'బీ'లో ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 30 వరకు పూల్ ఏ, అక్టోబరు 1 నుంచి 3 వరకు పూల్ బీ జట్లు లీగ్, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఆడుతాయన్నారు. అక్టోబరు 4, 5 తేదీల్లో సెమీస్, ఫైనల్స్ ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు ఉపేందర్, ఖాజా, రాము, కుమార్, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, ప్రభాకర్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

**తొలి మ్యాచ్‌లో ఓటమి:** టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అహ్మద్ 38 పరుగులు చేశాడు. ఛేదనలో వరంగల్ జట్టు 29.4 ఓవర్లలో 87 పరుగులకు కుప్పకూలింది. 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మహబూబ్‌నగర్ బౌలర్ ముకేశ్ 3 వికెట్లు, అహ్మద్ 2 వికెట్లు తీశారు.




క్రికెటర్ల పరిచయ కార్యక్రమంలో 'కుడా' ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి

**5 వికెట్ల తేడాతో నల్గొండ విజయం:** కోమటిపల్లి క్రికెట్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 21.2 ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 13.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి విజయం సాధించింది. విష్ణువర్ధన్ 37 పరుగులతో పాటు 3 వికెట్లు తీసి రాణించాడు.

**నేటి మ్యాచ్‌లు**
29న వరంగల్ X మెదక్ (మొగిలిచర్ల మైదానం),
నల్గొండ X మహబూబ్‌నగర్ (కోమటిపల్లి మైదానం)

## అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలంగాణలోని వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లి పందిరి.నెట్ మేరు/దర్జీ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయో డేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 83744 45190, 80080 02165 సంప్రదించవచ్చు.

## వ్యాన్ బోల్తా.. 13 ఆవుల మృతి

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల శివారులో శనివారం వేకువజామున ఓ వ్యాన్ బోల్తా పడడంతో 13 ఆవులు మృతి చెందాయి. మరి కొన్నింటికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో ఆవులను తరలిస్తున్నారు. అతివేగం కారణంగా వావిలాల శివారులోని మూల మలుపు వద్ద వ్యాన్ బోల్తా పడింది. వాహనంలో 51 ఆవులు, లేగదూడలు ఉండగా 13 ఆవులు మృతి చెందాయి. మిగతా ఆవులను పోలీసులు పాలకుర్తిలోని గోశాలకు తరలించారు. గాయపడిన ఆవులకు పశువైద్యాధికారులు చికిత్స అందించారు. వాహన చోదకుడు పరారీలో ఉన్నాడు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని సమాచారం. సంఘటన స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి సందర్శించారు.

**ప్రమాదకరంగా మలుపు:** వావిలాల శివారులోని మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఈ నెల 3న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టగా.. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి.

# ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

**రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే:** పండుగ వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శకులు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ మంత్రముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటున్న చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి







సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందడోలికల్లో తేలుస్తున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినిమాలలో సన్నివేశాలను ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కల్గించే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద డోలికల్లో తేలుతూ పండుగ వేళ చిన్నా పెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

**రవాణా సౌకర్యం..** రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

**మరిన్ని వివరాలకు..**
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

## పదేళ్లు గడిచినా పాత సూచికలేనా!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటింది. ఉమ్మడి వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించారు. ప్రధాన రహదారులపై ఇంకా పాత బోర్డులే దర్శనమిస్తున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద ప్రధాన రహదారిలో ఇలా ముగింపు, ప్రారంభం బోర్డులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పేరుమీదే ఉన్న చిత్రం ఇది.
– ఈనాడు, హనుమకొండ




**చికెన్ ధరలు**
(కిలో వెల రూపాయలలో)

| వెన్‌కాబ్ | |
|---|---|
| ఫాం: | 125 |
| రిటైల్: | 147 |
| డ్రెస్డ్: | 213 |
| స్కిన్‌లెస్: | 243 |

# అంబులెన్స్‌కు ట్రాఫిక్ ఇబ్బందులు


కాజీపేట చౌరస్తా సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

**కాజీపేట, న్యూస్‌టుడే:** అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలన్న నిబంధనను వాహనదారులు పట్టించుకోవడం లేదు. శనివారం కాజీపేట చౌరస్తాలో సిగ్నల్ వద్ద అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. సిగ్నల్స్ వద్ద రెడ్‌లైట్ పడినప్పుడు అంబులెన్స్ వస్తే మానవీయ దృక్పథంతో ఇతర వాహనాలను నిలిపి దీనికి దారి ఇవ్వాలి. కానీ ఉదయం 8.35 గంటల సమయంలో గుండె పోటుతో బాధపడుతున్న వ్యక్తిని హనుమకొండ నుంచి హైదరాబాదుకు తీసుకెళ్తున్న అంబులెన్స్‌కు దారి దొరక్క మూడు నిమిషాలు ఆగింది. చౌరస్తాలో ఇటీవల మరమ్మతు చేసిన రోడ్డు వద్ద పోసిన మట్టిని ట్రాక్టర్‌కు ఎత్తుతున్న క్రమంలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించే అంబులెన్స్‌లకు దారి ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు పదోన్నతులు


సంతోషి, ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్

**వరంగల్ న్యాయ విభాగం, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ఎం.సంతోషి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్ల(పీపీ)లకు పదోన్నతి కల్పించి బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రత్యేక చీఫ్ సెక్రటరీ రవిగుప్తా ఆదేశాలు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా సహాయక సెషన్స్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఎం.సంతోషికి గ్రేడ్-1 పదోన్నతి కల్పించి వరంగల్ ఉమ్మడి జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానానికి పీపీగా బదిలీ చేశారు. అలాగే ఈమె ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్‌గా కొనసాగనున్నారు. హనుమకొండ ప్రధాన సహాయక సెషన్ కోర్టులో పీపీ గ్రేడ్-2గా పనిచేస్తున్న జి.భద్రాద్రి రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు గ్రేడ్-1 పీపీగా.. వరంగల్ సహాయక సెషన్స్ కోర్టు పీపీగా పనిచేస్తున్న ఎల్‌హెచ్ రాజేశ్వర్‌రావు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ గ్రేడ్-1గా వెళ్తున్నారు.

## ఆరోగ్య సిబ్బందికి గుండె పరీక్షలు

**ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే:** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కమిషనర్ కుటుంబ సంక్షేమశాఖ ఆదేశాల మేరకు శనివారం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగులకు వైద్య శిబిరం నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో డా.లలితాదేవి తెలిపారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేసి, నమూనాలను టీహబ్‌కు పంపించామన్నారు. జిల్లాలో 64,244 మంది రక్తపోటుతో, 45,942 మంది మధుమేహంతో, 509 మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఎన్‌సీడీ పీవో డా.ఇబ్రార్ అహ్మద్, ఎన్‌సీహెచ్‌పీవో డా.నాగరాజు, డెమో వి.అశోక్‌రెడ్డి, డా.రోహిత్, ఏవో సదానందం, సూపరింటెండెంట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## చేనేత రంగాన్ని ఆదుకుంటాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**శాయంపేట, న్యూస్‌టుడే:** చేనేత రంగాన్ని ఆదుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో 64వ వార్షిక మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘానికి రావాల్సిన బకాయిలు రూ.15 లక్షలు ఇప్పించడం జరిగిందని తెలిపారు. కార్మికులు తయారుచేసిన వస్త్రాలు నిల్వలు ఉండే సందర్భంలో శాఖ మంత్రితో మాట్లాడి కొనుగోళ్లు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ శంకర్‌లింగం, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

**పాలకవర్గంతో గొడవ...:** చేనేత మహాసభ ముగిసిన అనంతరం పాలకవర్గంతో సభ్యులు గొడవకు దిగారు. సంఘం నష్టాలతో నడుస్తున్న క్రమంలో ఖర్చులు అధికంగా పెడుతూ కొందరూ డైరెక్టర్లు విలాసాలకు పోతున్నారని విమర్శించారు. సంఘం వ్యాపార సలహా కమిటీలతో సమావేశాలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే రాజీనామా చేసి అవినీతిపై సబ్ కమిటీ వేయించాలని డిమాండ్ చేశారు.

# భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం


కేయూలో నివాళి అర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

**మడికొండ, న్యూస్‌టుడే:** చిన్న వయసులోనే బ్రిటిష్ పాలకులను గడగడలాడించి, ప్రాణాలను గడ్డిపోచగా భావించి ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని భజరంగ్‌దళ్ మహానగర సంయోజక్ కొల్లూరి ఆదిత్య సాయి అన్నారు. భగత్‌సింగ్ జయంతిని మడికొండ చౌరస్తాలో ఛత్రపతి శివాజీసేన, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నాయకులు పొనగొటి వెంకటరావు, మహేందర్, పిట్టల రమేశ్, దువ్వ వేణు, ధనుంజయ్, అరవింద్, వినయ్, బండరాజు పాల్గొన్నారు.

**విద్యానగర్ :** భగత్‌సింగ్ పోరాటాలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ఆకుతోట శ్రీనివాస్ అన్నారు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేయూలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. నాయకులు పరిమళ, ప్రతిమ, స్వాతి, రావళిక, సాయితేజ, కుమార్ పాల్గొన్నారు.

**ముచ్చర్ల(భీమారం) :** హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో భగత్‌సింగ్ చిత్రపటానికి గ్రామస్థులు నివాళులు అర్పించారు. గ్రామస్థులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, రాజ్‌కుమార్, మల్లేశం, విజయ్‌కుమార్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. హనుమకొండ మండలం గుండ్లసింగారంలోని ఇందిరమ్మ కాలనీలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి చిరంజీవి, నాయకులు అశోక్, రాంబాబు, విక్రమ్, సంతోష్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడదాం


ప్రసంగిస్తున్న ఎంపీ కావ్య. చిత్రంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, నాయకులు

**పరకాల రూరల్, న్యూస్‌టుడే:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. శనివారం పరకాలలోని ఓ వేడుక మందిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఎక్కువ స్థానాలు గెలుచుకోవడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజామోదం ఉన్న వ్యక్తులను ఎంపిక చేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం, పార్టీపై భారాస నాయకులు, కార్యకర్తలు చేసే ప్రతి చర్యను తిప్పికొట్టాలని సూచించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, డీసీసీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే ములుగూరి భిక్షపతి, మార్కెట్ ఛైర్మన్ రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పరకాల నడికూడ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# బాలుడిని అపహరించారంటూ ఫిర్యాదు

**కాజీపేట టౌన్, న్యూస్‌టుడే:** తమ ఐదేళ్ల కుమారుడిని ఎవరో అపహరించుకుపోయారని దంపతులు విలపిస్తున్న సంఘటన శనివారం కాజీపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రంగసాయిపేటకు చెందిన ఎస్‌కే.మసూద్, కౌసర్ దంపతులు తమ ఇద్దరు కుమారులను తీసుకుని శుక్రవారం సాయంత్రం జనగాం వెళ్లేందుకు కాజీపేటకు వచ్చారు. వారి మధ్య చిన్న విషయమై గొడవ జరగడంతో కౌసర్ చిన్న కుమారుడు ఇప్తా(9)ను తీసుకుని ముందుకు వెళ్లింది. అక్కడే డివైడర్‌పై ఉన్న ఓ ముస్లిం కుటుంబానికి పెద్ద కుమారుడు ఆయాన్(5)ను చూస్తుండమని చెప్పి మసూద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లి కొద్దిసేపటికి భార్యను తీసుకుని రాగా.. పెద్ద కుమారుడు కనిపించలేదు. రాత్రి వరకు కూడా ఆయాన్ లభించకపోవడంతో ఎవరో తమ పిల్లాడిని అపహరించుకు పోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలుడు తప్పిపోయినట్లు కేసు నమోదు చేసి, వెతుకుతున్నామని చెప్పారు. కొందరు తమ పిల్లలను అమ్ముకుని, తర్వాత ఎవరో అపహరించారంటూ ఫిర్యాదు చేస్తున్నారని.. ఇది కూడా అదే కోవకు సంబంధించిన ఘటనగా పోలీసులు అనుమానిస్తున్నారు.



## సాంకేతిక రంగాభివృద్ధిలో మహిళల కీలక పాత్ర


విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న అతిథులు

**చింతగట్టు(భీమారం), న్యూస్‌టుడే:** సాంకేతిక రంగాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని వరంగల్ నిట్ ప్రొఫెసర్ రమ తెలిపారు. అనంతసాగర్ శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ ఉమెన్ ఇన్ ఇంజినీరింగ్ ఎఫినిటి గ్రూపు ఆధ్వర్యంలో వరంగల్ జోనల్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌ను విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఐ.రాజశ్రీరెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్య రంగంలో కృత్రిమ మేధ అప్లికేషన్స్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఐఈఈఈ ఉమెన్ ఏజీ సెక్రటరీ పి.ఎ.హర్షవర్ధిని, మహేష్ నీరటి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మూల రాము, ఏవో వేణుగోపాల స్వామి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య

**భట్టుపల్లి(కాజీపేట రూరల్), న్యూస్‌టుడే:** అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది మున్సిపాలిటి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట మండలం భట్టుపల్లి హవేలి కొత్తపల్లిలో శనివారం చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై రాజబాబు కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన నాగపురి కుమారస్వామి (57) కొద్ది నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లి మందులు వాడిన నయం కాకపోవడంతో తన పాత ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రెండు రోజుల పసికందు మృతి

**పరకాల, న్యూస్‌టుడే:** రెండు రోజుల పసికందు శ్వాస సమస్యతో మృతి చెందగా వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. స్థానికుల కథనం ప్రకారం... నడికూడ మండలం వరికోల్‌కు చెందిన గర్భిణిని రెండు రోజుల క్రితం పరకాలలోని ఓ ఆసుపత్రికి ప్రసవం కోసం తీసుకొచ్చారు. అదే రోజు మగ శిశువు జన్మించాడు. శనివారం పిల్లల వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లగా ఉదయం రెండు టీకాలు వేశారు. సాయంత్రం చిన్నారి పరిస్థితి విషమంగా మారడంతో ఆసుపత్రికి తీసుకొచ్చి గొడవకు దిగారు. అప్పటికే పసికందు మృతి చెందగా డాక్టర్ నిర్లక్ష్యమేనని ఆరోపించారు.

## సారూ.. న్యాయం చేయండి

**శాయంపేట :** న్యాయం చేయాలని చిన్నారులు శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కోరారు. శాయంపేటకు వచ్చిన ఆయన్ను కలిశారు. శాయంపేటలో 20 రోజుల కిందట ఓ ఇంటి పనికి వెళ్లిన తమ తండ్రి లోకల బోయిన ఎల్లయ్య గాయపడ్డారని పిల్లలు మౌనిక, కార్తిక్ తెలిపారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వెంటనే సీఐ రంజిత్‌రావును పిలిపించి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

# స్వచ్ఛతపై ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

హనుమకొండలోని చైతన్య వర్సిటీ విద్యార్థులు 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శనివారం ఫ్లాష్‌మాబ్, వాక్‌థాన్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు మొదట నగరంలో వాక్‌థాన్ నిర్వహించారు. పలు కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, మన జీవన విధానం కావాలని పేర్కొన్నారు. అనంతరం వర్సిటీ ఆవరణలో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. డీజే పాటలకు విద్యార్థులు స్టెప్పులేసి అలరించారు. - న్యూస్‌టుడే, నయీంనగర్

## చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి

**ఎన్జీవోస్‌కాలనీ, న్యూస్‌టుడే:** మహిళలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం వడ్డేపల్లిలోని ప్రభుత్వ మహిళా పింగిళి కళాశాలలో జూనియర్ విద్యార్థినులకు సీనియర్ విద్యార్థినులు స్వాగత వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ కవిత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలకు ఎంపిక

**ఐనవోలు, న్యూస్‌టుడే:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కళాఉత్సవ్ పోటీలు శనివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఆరు విభాగాల్లో పోటీ పడ్డారు. నృత్య పోటీలో ఎం.మనోజ్ఞ, గానంలో కె.హర్షిణి, బృంద గానంలో యశ్వంత్, ఎండీ రహ్మాన్, గ్రూప్ నాటికల పోటీలో సింగారం ప్రభుత్వ పాఠశాల, విజ్వల్ ఆర్ట్స్‌లో ఎస్.మేఘన కొండపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని ఎంఈవో ఆనందం పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, కేజీబీవీ ఎస్‌వో సత్యవాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.

# సర్దుబాటు ఉత్తర్వులను సవరించాల్సిందే

**వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవరించాలని శనివారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు నిరసన తెలిపారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో అన్యాయం జరిగిన వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 25ను సవరించాకే సర్దుబాటు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఉన్నా ఇద్దరే టీచర్లు ఉండాలనడం సమంజసం కాదన్నారు. ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉంటే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు లింగారెడ్డి, సోమశేఖర్, రమేష్, పెండెం రాజు, సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

**విద్యానగర్, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిక్షణలో వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అన్నారు. క్లబ్ వరంగల్ కార్యదర్శి పల్లెర్ల వీరన్న సారథ్యంలో విశ్వవిద్యాలయ ఆడిటోరియం ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే తయారు చేసిన విత్తన బంతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసం నారాయణ, వెంకయ్య, రాధిక, కిషోర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## 1న డీఈఈ సెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**వరంగల్ విద్యావిభాగం:** డీఈఈ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అక్టోబర్ 1న డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.నారాయణరెడ్డి శనివారం తెలిపారు. గతంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని వారు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90304 92595 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## 'హెచ్ఎంను సస్పెండ్ చేయాలి'

**కమలాపూర్:** కమలాపూర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం మీస రాజమల్లయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహస్వామి డిమాండ్ చేశారు. శనివారం కమలాపూర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహిళా ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీల పట్ల చులకనగా మాట్లాడుతూ అవమానిస్తున్నారని ఆరోపించారు.

## మోడల్ పార్కుగా అభివృద్ధి చేయండి

**సుబేదారి, న్యూస్‌టుడే:** కనకదుర్గకాలనీలోని పార్కును మోడల్‌గా అభివృద్ధి చేయాలని ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీతో కలిసి పార్కును పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వసంత పాల్గొన్నారు.

# సంక్షిప్తంగా

### నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**ఎల్కతుర్తి, న్యూస్‌టుడే:** ఎల్కతుర్తిలో ఆదివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### 2న చదరంగం పోటీలు

**వరంగల్ క్రీడావిభాగం:** వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి ర్యాంకింగ్ టోర్నీ పోటీలు ఉంటాయని నిర్వాహణ కార్యదర్శి కన్నా తెలిపారు. అక్టోబరు 2న హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని తుశారా ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హనుమకొండ చౌరస్తా:** నగరంలోని 10వ డివిజన్ పద్మాక్షికాలనీ రోడ్డులోని జయ నర్సింగ్ కళాశాల వద్ద, వడ్డెర కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు కుమార్ యాదవ్, మంద రాజేష్, రామకృష్ణ, కౌటిల్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

### ముందస్తు బతుకమ్మ వేడుకలు


ములుకనూర్ గ్రామ పంచాయతీ ముందు బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**భీమదేవరపల్లి:** మండలంలోని ములుకనూర్ మేజర్ పంచాయతీలో శనివారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ పక్షోత్సవాల్లో భాగంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యాలయ ఆవరణంలో మహిళలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు బతుకమ్మలు పేర్చి ఆట పాటలతో అలరించారు.

### బంధం చెరువు వద్ద నిర్మాణాలకు నోటీసులు

**కాజీపేట:** కాజీపేటలోని బందం చెరువు పక్కన ఉన్న నిర్మాణాలకు నోటీసులు అందాయి. అప్పటి ప్రభుత్వం అందించిన ఇళ్లకు కూడా నోటీసులు ఇవ్వడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఖాజీపేట గ్రామంలోని సర్వే నంబరు 27లో పోలీసు అమరవీరుల కుటుంబాలకు 200 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇచ్చారు. వీటిలో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం కలెక్టర్ నుంచి వీరికి నోటీసులు వచ్చాయి. దీంతో శనివారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను కలిసి తమకు అప్పటి ప్రభుత్వం అందించిన పట్టాలను చూపించి సమస్యను వివరించినట్లు పోలీసు అమరవీరుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం రేణుక, ఉపాధ్యక్షురాలు స్వరూపరాణి తెలిపారు.

### కిట్స్‌లో శిక్షణ విజయవంతం


శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

**ముచ్చర్ల (భీమారం), న్యూస్‌టుడే:** భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ట్రైనింగ్ సెషన్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్‌లోని ఫౌండర్స్ ల్యాబ్ ఇంక్యుబేషన్ మేనేజర్ ధ్రుతి, ఇంక్యుబేషన్ అసోసియేట్ రాకేశ్‌కుమార్ సాహు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కిట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పచ్చదనం ప్రగతికి నాంది

**రాంపూర్(మడికొండ), న్యూస్‌టుడే:** పచ్చదనం ప్రగతికి నాంది అని, మొక్కలు నాటి రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు శారద అన్నారు. కాజీపేట మండలం రాంపూర్‌లో ఆధ్వర్యంలో శనివారం గ్రీన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులు, బాలింతలు ప్లకార్డులు ధరించి పచ్చదనం ప్రాముఖ్యతను చాటారు. ఎస్ఎంసీ ఛైర్మన్ గడ్డం రమాదేవి, ఆయాలు చంద్రమ్మ పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

**సుబేదారి:** కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని నినాదాలు చేశారు. నాయకులు బాబు, నవనీత, కోటి, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి సోమవారం గచ్చిబౌలికి ప్రత్యేక బస్సు

**హనుమకొండ చౌరస్తా:** ఆర్టీసీ ప్రయాణికుల డిమాండు మేరకు హనుమకొండ బస్టాండు నుంచి ప్రతి సోమవారం ఉదయం గచ్చిబౌలికి రాజధాని ఏసీ బస్సు నడపనున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. బస్సు ఉదయం 5 గంటలకు బయలుదేరి ఉప్పల్, జేబీఎస్, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, హైటెక్ సిటీ మీదుగా గచ్చిబౌలికి వెళ్తుందన్నారు. తిరిగి ఉదయం 10.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హనుమకొండకు వస్తుందని చెప్పారు. టికెట్టు ధర రూ.450గా నిర్ణయించారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

### వెయ్యి కి.మీ. సైకిల్ ఛాలెంజ్ పూర్తి


హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్‌ను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

**మడికొండ:** వెయ్యి కిలోమీటర్ల సైకిల్ ఛాలెంజ్‌ని పూర్తిచేసిన మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌ను పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అభినందించారు. బాలసముద్రం ఏజే పెడిల్స్ నిర్వహించిన 45 రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల ఛాలెంజ్‌ని జయరాజ్ నిర్ణీత సమయంలో పూర్తిచేసి మొదటి స్థానంలో నిలిచారు. శనివారం మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ ఆయనకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.

### ప్రాచీన శిల్ప కళాసంపదకు నిలయం ఓరుగల్లు


భారతీస్వామికి పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే :** ప్రాచీన శిల్ప కళాసంపదకు నిలయం ఓరుగల్లు అని ఆధ్యాత్మిక గురువు, దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కమలానంద భారతీస్వామి అన్నారు. శనివారం ఆయన హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై స్వామీజీని సత్కరించారు. వీహెచ్‌పీ నాయకులు భాస్కర్‌రావు, జయపాల్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

**పెద్దపెండ్యాల(ధర్మసాగర్), న్యూస్‌టుడే:** ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బత్తిని రాజేందర్ శనివారం తెలిపారు. కాజీపేట సెయింట్ గాబ్రియేల్స్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన స్థాయి అండర్-17 విభాగం ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి లక్ష్మీ, శ్వేత, అభినవ వర్షిణి, నికిత, రవళి, సాయి చరణ్ ఎంపికయ్యారు. పీఈటీ రమేష్‌ను, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.



# పరకాల నియోజకవర్గం

### రాజీ ద్వారా కేసుల పరిష్కారం మేలు


పరకాలలో మాట్లాడుతున్న జడ్జి శాలినిలింగం

**పరకాల, న్యూస్‌టుడే:** రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం అన్నారు. శనివారం పరకాల కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 171 కేసులను రాజీమార్గంలో పరిష్కరించి రూ. 4,26,293లను జరిమాన వసూలు చేశారు. రెండవ తరగతి అదనపు న్యాయమూర్తి కొప్పుల శంకర్, లోక్ అదాలత్ సభ్యులు రాజమౌళి, సుధారాణి, రాహుల్ విక్రమ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి, ఏసీపీ కిషోర్‌కుమార్, కోర్టు పీపీ కుమార్, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్‌కు తీర్మానం

**శాయంపేట, న్యూస్‌టుడే:** శాయంపేట పీఏసీఎస్ సీఈవో రాజమోహన్ సస్పెన్షన్‌కు శనివారం పాలకవర్గం తీర్మానం చేసినట్లు ఛైర్మన్ కుసుమ శరత్ తెలిపారు. వడ్డీ సర్దుబాటుకు సంబంధించి ఫిర్యాదులు నేపథ్యంలో విచారణ చేపట్టిన అధికారులు ప్రాథమిక నివేదికను డీసీవో నీరజకు అందజేశారు.

### మైలారంలో బతుకమ్మ వేడుకలు


వేడుకల్లో తహసీల్దార్ సత్యనారాయణ

**శాయంపేట:** మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఏఆర్ఐ రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### అత్యాచార యత్నం.. కేసు నమోదు

**ఆత్మకూరు:** వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేట గ్రామానికి చెందిన ఓ వివాహిత భర్త అనారోగ్యంతో బాధపడుతుండగా ఇంటి వద్ద ఉంటు భర్త బాగోగులు చూసుకుంటుంది. ఇదే గ్రామానికి చెందిన కడుదుల చిరంజీవి అసభ్యకరంగా మాట్లాడుతూ వివాహిత ఇంటికి వెళ్లి అత్యాచార యత్నం చేశాడు. బాధిత మహిళ శనివారం ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు

**నడికూడ:** చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు అన్నారు. చర్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రావు అన్నారు. శనివారం మండలంలోని చర్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) క్రీడా పోటీలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచి చాడ తిరుపతిరెడ్డి హాజరై ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా కార్యదర్శులు పాల్గొన్నారు.

### మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాల అందజేత

**పరకాల, న్యూస్‌టుడే:** పరకాల, నడికూడ మండలాలకు చెందిన మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ పథకం కింద ద్వారా నాలుగు రోజుల పాటు అందించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలను పంపు అపరేటర్లకు అందజేశారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న వాటిని గ్రామాల్లో అమలుపర్చి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుకుమార్, ఏఈ రమణయ్య, గ్రిడ్ ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.